సాక్షి ఏలూరు

శుక్రవారం ♦ 26 ♦ జనవరి ♦ 2024



గెలుపే లక్ష్యం కావాలి

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు.

IIలో ▸



పెద్ద పులి సంచారం

బుట్టాయగూడెం మండలం కోపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్ద పులి పరిసర ప్రాంత గిరిజనులను హడలెత్తిస్తోంది.

IIలో ▸



పట్టిసం ఏర్పాట్ల పరిశీలన

అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రం వద్ద జరిగే మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.

IIలో ▸

న్యూస్‌రీల్

బాలికా దినోత్సవ విజేతలకు బహుమతులు



బహుమతులు అందిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించగా విజేతలకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ గురువారం బహుమతులు అందజేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేల చొప్పున చెక్కులు అందించారు. వ్యాసరచనలో జె.హేమపావని, పి.రాధ, ఎస్.లక్ష్మీపూజ, చిత్రలేఖనంలో కె.గుణగాయత్రి, కె.సాయిత్య, సీహెచ్ యతికి రేమా, వక్తృత్వంలో జె.అఖిల మాధురి, బి.యస్విత శ్రీ, ఎస్.లక్ష్మీపూజ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శర్మిష్ఠ, డీసీపీఓ సూర్యచక్రవేణి, డీఈఎంఓ డి.నాగరత్నం పాల్గొన్నారు.

ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం రూ.1.20 కోట్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ఆర్టీసీ డిపోల నుంచి సంక్రాంతికి ప్రత్యేక, రెగ్యులర్ సర్వీసుల ద్వారా రూ.1.20 కోట్ల ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 520 బస్సు సర్వీసులను ఈ ఏడాది నడిపామన్నారు. అలాగే శివరాత్రికి ప్రత్యేక సర్వీసులను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈనెల 15 నుంచి రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రమాద రహితంగా బస్సులు నడపడం కోసం ఏడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రక్తదాన శిబిరం, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రమాద రహిత డ్రైవర్లకు నగదు పురస్కారాలు అందజేస్తామని వివరించారు.

ఆర్యవైశ్య సంఘ కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో నిర్వహించిన సంఘ ఎన్నికల్లో అధ్యక్షుడిగా చలువాది బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా మోటమర్రి సదానందకుమార్, మహిళా అధ్యక్షురాలిగా తవ్వ అరుణకుమారి ఎన్నికయ్యారు. ఉన్న శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి సదానందకుమార్ మాట్లాడుతూ ఏలూరు అర్బన్ జిల్లా పరిధిలో ఆర్యవైశ్యులకు అన్నివేళలా అందుబాటులో ఉంటామన్నారు. తమ కమిటీ పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగిన అనంతరం ఆర్యవైశ్యుల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. మాజీ అధ్యక్షుడు చెక్క రాజా, కార్యదర్శి పైడి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.8.80 లక్షలు స్వాధీనం

పెనమలూరు: మండల పరిధిలోని కానూరు వద్ద కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద పోలీసులు రూ.8.80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు కథనం మేరకు.. కానూరు 100 అడుగుల రోడ్డులో పోలీసులు బుధవారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఉంగుటూరు మండలం వెలమిల్లి గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి వాకచర్ల వెంకటేశ్వరరావు ప్రయాణిస్తున్న కారులో రూ.8.80 లక్షల నగదును గుర్తించారు. ఆ నగదుకు సంబంధించిన పత్రాలను అతను పోలీసులకు చూపలేదు. దీంతో పోలీసులు ఆ సొమ్మును స్వాధీనం చేసుకుని గురువారం కేసు నమోదు చేశారు.

అత్తిలిలో ఆసరా కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు



ఆనందాల ఆసరా

రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత లక్ష్యంగా సీఎం జగన్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వరుసగా నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధులను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమచేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు ఆసరా చెక్కులు అందిస్తుండగా.. లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు.

– అత్తిలి/ఆగిరిపల్లి/మొగల్తూరు /ఉంగుటూరు



ఆగిరిపల్లిలో మహిళలకు చెక్కు అందిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

హామీలను నెరవేర్చిన సీఎం జగన్

డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాలుగు దశల్లో పూర్తిగా డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పిన మాటను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నూజివీడు ఎమ్మెల్యే

(ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)

ఆదాయం పెంచుకునేలా..



ఆసరా పథకంలో ఒక్కో విడతలో నాకు రూ.13 వేలు వచ్చాయి. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన సాయంతో ఇంటి వద్ద జిరాక్స్ మెషీన్ పెట్టుకున్నాను. దీని ద్వారా కుటుంబ ఆదాయం పెంచుకుంటున్నా. ఇదంతా సీఎం జగన్ వల్లే సాధ్యం

– జలసూత్రం లక్ష్మీశ్రీ హరిత, వడ్లమాను

జగన్‌కు రుణపడి ఉంటాం



మా సంఘానికి రూ.6 లక్షల డ్వాక్రా రుణమాఫీ అయ్యింది. నాకు వచ్చిన మొత్తంతో 15 మేకలు కొన్నాను. నలుగురు అమ్మాయిల పెళ్లిళ్లు కూడా చేశాను. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను.

– దేవరకొండ అలివేలు, ఆగిరిపల్లి

మహిళా స్వావలంబనే లక్ష్యం

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి

(అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



అత్తిలిలో ఆసరా చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి, ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు



కైకరంలో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

మహిళలను వంచించిన బాబు

గత ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీకి హామీ ఇచ్చి మోసం చేస్తే.. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పి సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారు.

– పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే

(కైకరంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



పేరుపాలెంలో అక్కచెల్లెమ్మలకు ఆసరా చెక్కు అందిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

సాధికారతకు పెద్దపీట

రాష్ట్రంలో మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. రాబోయే రోజుల్లో మహిళలంతా ఆయనకే మద్దతు పలకాలి.

– ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్

(మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)

30న ఎన్నికల సన్నాహక సభ

దెందులూరుకు సీఎం జగన్ రాక

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరులో ఈనెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సన్నాహక సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు బహిరంగ సభా స్థలం, హెలీప్యాడ్ ప్రాంతాలను గురువారం సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి లక్ష మంది వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారని, ఎటువంటి అసౌకర్యం లేకుండా వాహనాల పార్కింగ్, సభాస్థలి, ఇతర ఏర్పాట్లకు స్థలాలను పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికల శంఖారావం, సన్నాహక సభ ఇక్కడ నిర్వహించడం ఆనందంగా ఉందని, అందరి సహకారంతో సభ విజయవంతానికి కృషి చేస్తానన్నారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్‌లు అప్పన ప్రసాద్, నెరుసు చిరంజీవులు, వైఎస్సార్ సీపీ నాయకులు మంచెం మైబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయ్‌బాబు, ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కో–ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్

సీనియారిటీ జాబితా విడుదల

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న సహోపాధ్యాయ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు ఎస్‌జీటీ ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు గురువారం ప్రకటనలో తెలిపారు. సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, ఐటీడీఏ, పాఠశాలల్లోని నోటీసు బోర్డుల్లో జాబితాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 31లోపు తెలియజేయాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ద్వారా జిల్లాలో 16.24 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, ఆర్డీఓ ఖాజావలి ఓటు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లు ముద్దం సుబ్బారావు, దాట్ల శేషమరాజు, దేవరపల్లి కుటుంబరావు, పొన్నగంటి సూరమ్మ, మల్లెమొగ్గల సత్యనారాయణ, ముంతా విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతులు భీముని రమేష్‌ను కలెక్టర్ సత్కరించారు. కొత్తగా ఓటరుగా నమోదైన ఐదుగురు విద్యార్థులకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఏలూరు కమిషనర్ ఎస్.వెంకట కృష్ణ, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, తహసీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.



జాతీయ ఓటర్ల దినోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్

గణతంత్ర వేడుకలకు సిద్ధం

ఏలూరు(మెట్రో): భారత 75వ గణతంత్ర దినోత్సవ జిల్లాస్థాయి వేడుకలు శుక్రవారం ఉదయం ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభమవుతాయని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరణ, 9.15 గంటలకు జిల్లాలో ప్రగతిపై సందేశం ఉంటుందన్నారు. 9.30 గంటలకు పోలీసు కవాతు, 10 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన, 10.20 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 10.55 గంటలకు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల అందజేత కార్యక్రమాలు ఉంటాయన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఏలూరు (టూటౌన్): సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు, వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి కోరారు. స్థానిక గిరిజన భవన్‌లో బేటీ బచావో–బేటీ పడావో (ఆడపిల్లలను బతికిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం) వర్క్‌షాపును జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ బాలికల సంక్షేమం, వారి చదువుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అవగాహన బోర్డులను ఆమె ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ పీడీ కేవీఏఎల్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.



గణతంత్ర వెలుగులు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరులో కలెక్టరేట్ విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. భవంతిపై డిజిటల్ కాంతుల్లో వీరజవాన్, మహాత్మా గాంధీ నడక, జాతీయ పతాక దృశ్యాలు రంగులతో మెరిశాయి.

-సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

భారీగా తెలంగాణ మద్యం పట్టివేత

వేలేరుపాడు : కట్కూరులో ఓ షాపులో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న తెలంగాణ మద్యాన్ని గురువారం పోలీసులు పట్టివేశారు. వివరాలిలా ఉన్నాయి. కట్కూరు గ్రామంలో ముత్తబోయిన రాంబాబు అనే వ్యక్తి తన కిరాణా షాపులో తెలంగాణ రాష్ట్రం నుంచి తీసుకువచ్చిన మద్యాన్ని విక్రయిస్తున్నాడు. దీనిపై తమకు అందిన సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో షాపులో ఉన్న రూ.24,480 విలువ చేసే 144 మాన్షన్ హౌస్ బ్రాండీ బాటిళ్లు, రూ.15,600 విలువ చేసే 120 ఓల్డ్ అడ్మిరల్ బ్రాండీ బాటిళ్లు, రూ.59,360 విలువ చేసే 371 నాక్ అవుట్ బీర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రాంబాబును అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడిలో కుక్కునూరు సీఐ వి.శ్రీనివాసరావు, వేలేరుపాడు ఎస్సై లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


కట్కూరులో పట్టుబడిన తెలంగాణ మద్యం

వైఎస్సార్‌ సీపీ గెలుపే లక్ష్యం కావాలి

- పుట్టింటికి వచ్చిన ఆనందం వనితమ్మలో కనిపిస్తోంది
- సమీకరణాల్లో భాగంగానే వనిత, తలారిల స్థానాల మార్పు
- వైఎస్సార్‌ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి
- ద్వారకాతిరుమలలో పార్టీ గోపాలపురం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం


ద్వారకాతిరుమల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ద్వారకాతిరుమల: పుట్టింటికి వచ్చిన ఆనందం వనితమ్మలో కనిపిస్తోందని, ప్రజలు ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో ఆమెను అఖండ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ద్వారకాతిరుమలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్‌ సీపీ గోపాలపురం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం, రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణా శాఖ మంత్రి తానేటి వనిత నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతల స్వీకరణ మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే గోపాలపురం, రాజానగరం ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి వనిత, ఎమ్మెల్యే తలారిలను పార్టీ నేతలు గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో మిథున్‌రెడ్డి మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం సొంత నియోజకవర్గం కావడమే వనితమ్మ ధైర్యానికి కారణమని, ఆ ధైర్యమే ఆమె గెలుపుకు నాంది పలుకుతుందన్నారు. సమీకరణాలు, పార్టీ నిర్ణయంలో భాగంగానే వనితను గోపాలపురానికి, తలారిని కొవ్వూరుకు పంపడం జరిగిందన్నారు. నియోజకవర్గం మారడం కొద్దిగా కష్టమైనా ఎంతో పెద్ద మనస్సుతో వీరిద్దరూ ఒప్పుకుని, పోటీ చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నా, గత ఐదేళ్లుగా జరిగిన మంచి కార్యక్రమాలన్నీ కొనసాగాలన్నా విభేదాలను పక్కనబెట్టి కలసికట్టుగా పార్టీ గెలుపుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఒక్కరూ గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. చంద్రబాబు డ్వాక్రా, బంగారు రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశారన్నారు. కానీ జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, విద్యా దీవెన, వసతి దీవెన వంటి ఎన్నో పథకాల ద్వారా పేదలకు మేలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన పార్టీ నేతలను ఆయన అభినందించారు.


సమావేశానికి భారీగా హాజరైన వైఎస్సార్‌ సీపీ శ్రేణులు

నా చెల్లెమ్మను భారీ మెజారిటీతో గెలిపించండి


తలారి వెంకట్రావు, గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు ఇన్‌చార్జి



నా చెల్లెమ్మ వనితమ్మను నా కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. 2014లో వనితమ్మకు ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశం వచ్చినప్పటికీ, తాను కొవ్వూరు వెళతానని, నా అన్న తలారికి గోపాలపురం కేటాయించాలని ఆమె చెప్పిందన్నారు. ప్రస్తుతం ఈ రెండు సీట్లు గెలవాలన్న ఉద్దేశంతో పార్టీ అధిష్టానం ఈ మార్పు చేసిందన్నారు. జగనన్న గెలుపే లక్ష్యంగా తాము పార్టీ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్రంలో వివిధ పథకాల ద్వారా జగనన్న లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.4 లక్షల 69 వేల కోట్లను అందించారన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.

నా అన్నయ్యతో విభేదాలు లేవు

తానేటి వనిత, హోం శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి



నా అన్నయ్య తలారి వెంకట్రావుకు, నాకు మధ్య ఏ విధమైన విభేదాలు లేవని, అవి కేవలం పుకార్లు మాత్రమేనని మంత్రి వనిత అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తనకు పార్టీ శ్రేణులు సాదర స్వాగతం పలకడం సంతోషానిచ్చిందన్నారు. నా వల్ల మంచి జరిగితేనే ఓటు వేయమని అడిగే దమ్మూ ధైర్యం జగనన్నకే సొంతమన్నారు. ప్రతి కుటుంబానికీ సీఎం సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారని, తాము ప్రజలను ధైర్యంగా ఓటు అడగడానికి కూడా అదే కారణమన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత 12 శాతంగా ఉన్న పేదరికాన్ని 6 శాతానికి తగ్గించారన్నారు. తన గెలుపు జగనన్నకు బహుమతి కావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కనబెట్టి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

అవినీతి రహితంగా జగన్ పాలన

జక్కంపూడి రాజా, రాజానగరం ఎమ్మెల్యే



జగనన్న పాలనలో అవినీతికి తావు లేదని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ రాజమండ్రి జిల్లా ఇన్‌చార్జి జక్కంపూడి రాజా అన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో తలారి వెంకట్రావు ఐదేళ్ల పాటు సమర్థవంతమైన పాలన అందించారన్నారు. అన్నా చెల్లెళ్లు ఇద్దరూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, వారిని గెలిపించాలని కోరారు. అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, చేదోడు ఇలా అన్ని పథకాలు కొనసాగాలంటే జగనన్న సీఎం కావాలన్నారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడన్నది ఎంత నిజమో.. తలారి, వనితలు గెలుస్తారన్నది అంతే నిజమన్నారు. ఇక్కడ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా వారి గెలుపునకు నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) కృషి చేస్తున్నారన్నారు.

జగనన్న మనల్ని మరచిపోరు

కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ



సృష్టించిన దేవుడు, కనిపెంచిన తల్లిదండ్రులైనా మనల్ని మరచిపోతారేమో గానీ జగనన్న మాత్రం ప్రజలను మరచిపోరని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. జగనన్న ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి సారించి, ఆ దిశగా పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా పేదల వద్దకే వైద్యాన్ని చేరుస్తున్నారన్నారు. వనితమ్మ, తలారిలు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకులని, వారిని గెలిపించుకోవాలన్నారు.

జగనన్న గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం

గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు



వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలకు, అలాగే తమ ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రజలకు జగనన్న గెలుపే లక్ష్యం కావాలని గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) అన్నారు. కుప్పం సీటు కూడా గెలిచి చూపించాలనే లక్ష్యంతో మిథున్ సారథ్యంలో తాము ముందుకెళుతున్నామన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో మంత్రి వనితమ్మ, కొవ్వూరులో తలారి వెంకట్రావుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు.

పట్టిసం ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రం వద్ద జరిగే మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ కె.అద్దయ్య గురువారం పరిశీలించారు. భక్తులు నది దాటేందుకు వీలుగా పంట్లు ఏర్పాటుచేసే ప్రాంతాన్ని పరిశీలించారు. గోదావరినీటి మట్టం ఎంత వరకు తగ్గుతుంది అనే పరిస్థితులను కూడా ఆయన అధికారుల నుంచి తెలుసుకున్నారు. భక్తులు క్షేత్రానికి వెళ్లేందుకు వీలుగా పక్కాగా నదిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈయన వెంట ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పట్టిసం రేవులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో కె.అద్దయ్య

విద్యుత్ సంస్థలో ఏలూరు సర్కిల్‌కు అవార్డులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ సంస్థ పరిధిలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి రిపబ్లిక్ డే సందర్భంగా ప్రదానం చేసే అవార్డులకు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని పలు విభాగాలు, పలువురు అధికారులు ఎంపికయ్యారు. ఉత్తమ ఆపరేషన్ సెక్షన్‌గా పెదపాడు, ఉత్తమ ఆపరేషన్ సబ్ డివిజన్‌గా కొవ్వూరు, ఉత్తమ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంగా పాలకొల్లు, ఉత్తమ కన్‌స్ట్రక్షన్ డివిజన్‌గా ఎంపికయ్యాయి. అలాగే ఉత్తమ ఉద్యోగులుగా వీరవాసరం ఏఈ కె.రవికుమార్ వర్మ, బుట్టాయగూడెం సెక్షన్ రాజానగరం జూనియర్ లైన్‌మెన్ పి.రాజు, విజిలెన్స్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.రాజా రమేష్ కుమార్ ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహించే రిపబ్లిక్ డే ఉత్సవాల్లో సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

పోలవరం రూరల్: సరిపల్లికుంట అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై పోలవరం పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చేసిన ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు
- చింతలపూడిలో వైఎస్సార్‌ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం


చింతలపూడిలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

చింతలపూడి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. స్థానిక వీకేఎం కల్యాణ మండపంలో గురువారం ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అధ్యక్షతన జరిగిన చింతలపూడి, లింగపాలెం మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కె.సునీల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి చింతలపూడి నియోజకవర్గంలో కలిసికట్టుగా సమష్టిగా పనిచేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో పార్లమెంట్‌కు లక్షకుపైగా ఓట్ల మెజార్టీ తీసుకు రావాలని అన్నారు. తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోయినా పార్టీ కోసం పూర్తి స్థాయిలో సేవలు అందిస్తానన్నారు. యువకుడైన కారుమూరి సునీల్ కుమార్, స్థానికుడైన చింతలపూడి అభ్యర్థి విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏలూరు రానున్నారని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కె.సునీల్ కుమార్ అన్నారు. తన తండ్రి కారుమూరి నాగేశ్వరరావు జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో తనకు చింతలపూడి నియోజకవర్గంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటికే రూ.రెండు లక్షల కోట్లకు పైగా పేదలకు అందించారన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకునేందుకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉంది

పార్టీ చింతలపూడి అసెంబ్లీ సమన్వయకర్త కె.విజయరాజు మాట్లాడుతూ తాను స్థానికుడినని, నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉందన్నారు. తనకు అవకాశం ఇస్తే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. పారిశ్రామికంగా నియోజకవర్గం అభివృద్ధి సాధించేలా కృషి చేస్తానన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ ఏలూరు పర్యటన సందర్భంగా రూపొందించిన సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ కోటగిరి, సునీల్ కుమార్, విజయరాజులను గజమాలలతో కార్యకర్తలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ సభ్యులు ఎం.నీరజా సుధాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్లు మేడవరపు అశోక్‌బాబు, బొడ్డు వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి కె.దినేష్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.భరత్‌రెడ్డి, లింగపాలెం మండల కన్వీనర్ కొఠారి మోహన్‌రావు, పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎం.దుర్గారావు పాల్గొన్నారు.


చింతలపూడిలో సీఎం పర్యటన సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం


చెరువులో పడి వ్యక్తి మృతి


కుక్కునూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. బంజరగూడెంలో జిమిలీ రాము (35) గురువారం బహిర్భూమి కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. స్థానికులు గమనించి బాధితుడిని బయటకు తీసే సమయానికి చెరువులో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హడలెత్తిస్తున్న పెద్ద పులి సంచారం

- రెడ్డికోపల్లిలో ఎద్దు కళేబరాన్ని పరిశీలించిన అటవీ అధికారులు
- కోపల్లి బీట్ పరిధిలో సంచరిస్తోంది పెద్దపులే అని నిర్ధారణ

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కోపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో సంచరిస్తున్న పెద్దపులి పరిసర ప్రాంత గిరిజనులను హడలెత్తిస్తోంది. బుధవారం రాత్రి పులిగాండ్రింపులు వినిపించాయని ముంజులూరు, రెడ్డికోపల్లి, వీరన్నపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు చెబుతున్నారు. అలాగే ఆయా గ్రామాల మధ్యలో ఉన్న కాల్వ ఒడ్డున పులి పాదముద్రలను స్పష్టంగా చూశామని గిరిజనులు అంటున్నారు. ఇదిలా ఉండగా పులిదాడిలో ఎద్దు మృతి చెందిన ప్రదేశాన్ని ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. అలాగే మృతి చెందిన ఎద్దు ప్రదేశం నుంచి సుమారు కిలోమీటర్ పొడవునా నాలుగువైపులా పులి సంచరించిన ప్రదేశాన్ని గుర్తించారు. జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ సబ్ డీఎఫ్ఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ అధికారులు అటవీప్రాంతంలోని పలు ప్రదేశాల్లో పాదముద్రలను గుర్తించి అవి పులివేనని ధ్రువీకరించారు. పులిరామన్నగూడెం, రెడ్డికోపల్లి, వీరన్నపాలెం గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు రాత్రివేళల్లో జాగ్రత్తగా ఉండాలని, ఎవ్వరూ బయట తిరగవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా మండలంలోని ఎర్రాయిగూడెం సమీపంలో సేకరించిన పాదముద్రలు ల్యాబ్‌కు పంపించామని అవి చిరుతపులివిగా గుర్తించామని అన్నారు. అయితే గురువారం నల్లజర్ల, చీపురుగూడెం సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో రోడ్డుమీద చిరుతపులి సంచరించడం ఆటో డ్రైవర్ చూసినట్లు తమకు సమాచారం అందిందని వైల్డ్‌లైఫ్ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా పులి ఆచూకీ కోసం అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు.


రెడ్డికోపల్లి బీట్ పరిధిలో పులి సంచార ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు


రెడ్డికోపల్లి బీట్ పరిధిలో పులి పాదముద్రలు